క్లుప్తంగా

నేడు, రేపు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు



బొగ్గులదిబ్బ పాఠశాలలో విద్యార్థుల పుస్తకాలను పరిశీలిస్తున్న డీఐ దిలీప్ కుమార్

కంబాలచెరువు: ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 28, 29 తేదీల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ తెలిపారు. స్థానిక బొగ్గుల దిబ్బ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల నోట్ బుక్స్ కరెక్షన్లను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ గురువారం నన్నయ మున్సిపల్ హైస్కూల్, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాల, డీఎంహెచ్ స్కూలు కాంప్లెక్స్‌లలో సమావేశాలు జరుగుతాయన్నారు. శుక్రవారం నెహ్రూనగర్, ప్రభుత్వ బాలుర హైస్కూల్, క్వారీ పేట హైస్కూల్, సిటీ మునిసిపల్ హైస్కూల్ కాంప్లెక్స్‌లలో జరుగుతాయన్నారు.

బూత్ కమిటీలు కేంద్రంగా కార్యక్రమాలు



సమావేశంలో పాల్గొన్న పురందేశ్వరి

రాజమహేంద్రవరం సిటీ: పోలింగ్ బూత్ కమిటీలు కేంద్రంగా పార్టీ కార్యక్రమాలు జరగాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం జిల్లా బూత్ స్వశక్తీకరణ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పురందేశ్వరి మాట్లాడుతూ శక్తి కేంద్రాలు బాధ్యులందరూ 11 మందితో పోలింగ్ బూత్ కమిటీలను నియమించాలన్నారు. వివిధ సమస్యలపై పోరాటం చేయడం ద్వారా మోర్చాలు బలోపేతం కావాలన్నారు. జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ద్వారా కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాథ్ రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి పాల్గొన్నారు.

సర్వేలో వివరాలు పక్కాగా ఉండాలి

కంబాలచెరువు: కుష్ఠు వ్యాధి సర్వేలో బాధితుల వివరాలు పక్కాగా తీసుకోవాలని జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో, లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబీ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వసుంధర అన్నారు. నేషనల్ లెప్రసీ ఎరాడికేషన్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం ఆమె క్షేత్రస్థాయి పర్యటన చేశారు. రికార్డు వివరాలను పరిశీలించి ఆశా, వలంటీర్లకు సూచనలు ఇచ్చారు. అంబేడ్కర్ నగర్‌లోని యూపీహెచ్‌సీకి వెళ్లి రికార్డులను తనిఖీ చేసి, కుష్ఠు వ్యాధిని పసిగట్టే విధానాలను తెలిపారు. ఒక అనుమానిత కేసును గుర్తించామని, దీనికి సంబంధించి వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. టీబీతో పాటు హెచ్‌ఐవీ పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పారామెడికల్ ఆఫీసర్ వీరలక్ష్మి, ఈశ్వరరావు, శివ పాల్గొన్నారు.

యూటీఎఫ్ ధర్నా

సీటీఆర్ఐ: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను తక్షణ పరిష్కరించాలన్నారు.

అంబేడ్కర్ విగ్రహం మార్చితే ఊరుకోం

సీటీఆర్ఐ: అభివృద్ధి పేరుతో గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని మార్చితే సహించేది లేదని రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ సంఘం నాయకులు హెచ్చరించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు మాట్లాడారు. దళిత సంఘాలు, ప్రజాసంఘాల ప్రతినిధుల అభిప్రాయాలు తీసుకున్న తర్వాత అంబేడ్కర్ విగ్రహం వద్ద మార్పులు చేయాలని డిమాండ్ చేశారు.

పడాల శత జయంతి పోస్టర్ ఆవిష్కరణ


ప్రకాశం నగర్: స్వాతంత్ర్య సమరయోధుడు, శతాధిక గ్రంథకర్త పడాల శత జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) అధ్యక్షుడు పడాల వీరభద్రరావు, కార్యవర్గ సభ్యుడు మాదేటి రవి ప్రకాష్, ప్రిన్సిపాల్ ఏబెల్ రాజబాబు తెలిపారు. ఎస్‌కేవీటీ కళాశాలలోని వివేకావర్ధిని సెమినార్ హాలులో బుధవారం పడాల శత జయంతి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అరసం జిల్లా శాఖ, ఎస్‌కేవీటీ తెలుగు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 6వ తేదీ శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ స్థానిక కందుకూరి వీరేశలింగం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పడాల రామారావు శత జయంత్యుత్సవాలను నిర్వహిస్తామన్నారు.

నాణ్యతగా.. శరవేగంగా..

- 16వ డివిజన్‌లో అభివృద్ధి పనులు
- అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణం



ఆవ వాంబే కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు



రైతు నగర్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ 16వ డివిజన్ పరిధిలోని రైతునగర్, ఆవ వాంబేకాలనీలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో పాటు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడంతో సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆవ వాంబే కాలనీలో రోడ్లు అధ్వానంగా మారడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రైతు నగర్‌లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. ఇటీవల ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ఆ ప్రాంతంలో పర్యటించారు. నగర పాలక సంస్థ కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి త్వరితగతిన సీసీ రోడ్ల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో పనులు చకచకా జరుగుతున్నాయి.

ముంపు సమస్య లేకుండా..

రైతు నగర్ నుంచి ఆవ వాంబే కాలనీ శివారు కాలువ వరకూ రూ.175 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నారు. అలాగే రూ.198 లక్షలతో ఆవ వాంబే కాలనీలో ప్రధాన రహదారిని ఇరువైపులా ఎత్తు చేస్తూ సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. భారీ వర్షాలు కురిసినా ఈ ప్రాంతంలో ముంపు సమస్య తలెత్తకుండా నగరపాలకసంస్థ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఆవ వాంబే కాలనీలో ప్రధాన సమస్య అయిన రోడ్ల నిర్మాణంతో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు వాంబే కాలనీలోని ప్రధాన రహదారి సీసీ రోడ్లు నిర్మాణం శరవేగంగా చేపడుతున్నామని నగరపాలకసంస్థ ఏఈ శ్రీధర్ తెలిపారు.

రాజమహేంద్రవరంలో అభివృద్ధి పరుగులు



ఎంపీ భరత్‌రామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

- రూ.కోట్లతో పలు కార్యక్రమాలు
- విలేకరులతో ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: నాలుగున్నరేళ్లలో నగరాన్ని ఏవిధంగా అభివృద్ధి చేసిందీ తాను ప్రత్యేకంగా చెప్పనవసరం లేదని, నగర వాసులే చెబుతారని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ నగరంలో ఇతర ప్రాంతాలకు అనుసంధానం అయ్యేలా 26 రహదారుల అభివృద్ధి పనులు రూ.36 కోట్లతో చేపట్టామని, నగరాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దామన్నారు. సీఎం ప్రత్యేక గ్రాంటుగా రూ.125 కోట్లు మంజూరు చేశారని, ఇంటర్నేషనల్ సిటీగా బహుముఖంగా అభివృద్ధి చేయాలన్నదే తన లక్ష్యం అన్నారు. రోడ్లను వెడల్పు చేసి, డివైడర్లలో అందమైన మొక్కలు నాటి హరిత నగరంగా అభివృద్ధి చేస్తామన్నారు. గ్లో గార్డెన్, యోగా స్ట్రీట్, ఫ్యాషన్ స్ట్రీట్ ఇలా రకరకాలుగా ప్రజలు మెచ్చే విధంగా నగరంలో ఎన్నో మార్పులు చేస్తూ వచ్చామన్నారు. మోరంపూడి జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టామని, నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని మర్చిపోలేమన్నారు. బొమ్మూరు, వేమగిరి, లాలా చెరువు, దివాన్ చెరువు సెంటర్లలో ఎఫ్ఓబీల నిర్మాణానికి శాంక్షన్లు వచ్చాయన్నారు. రాజమండ్రి ఎయిర్ పోర్ట్ టెర్మినల్ బిల్డింగ్ విస్తరణకు రూ.350 కోట్లు, రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.400 కోట్లు మంజూరయ్యాయన్నారు.

అంగన్‌వాడీలు సంయమనం పాటించండి

రాజమహేంద్రవరం రూరల్: అంగన్‌వాడీల ఆర్థిక ఇబ్బందులు, వారి ఆవేదనలు జగనన్నకు తెలియనివి కాదని, కాస్త సంయమనం పాటించాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ కోరారు. ఎంపీ కార్యాలయం వద్ద బుధవారం అంగన్‌వాడీలు ఆందోళన చేశారు. తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీకి అందించారు. ఈ సందర్భంగా భరత్ రామ్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరించారు. అంగన్‌వాడీ అక్కాచెల్లెమ్మలకు ఏమి కావాలో, మీరు ఏమి కోరుతున్నారో ముఖ్యమంత్రి జగనన్నకు తెలుసన్నారు. మీరు నా వద్దకు వచ్చి అర్జీ ఇచ్చారు కాబట్టి, నా వంతు బాధ్యతగా, మీ ప్రజాప్రతినిధిగా తాను స్వయంగా సీఎం జగనన్నను కలిసి విన్నవిస్తానని హామీ ఇచ్చారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

- హోంమంత్రి తానేటి వనిత
- ఘనంగా క్రిస్మస్ వేడుకలు



వేమగిరిలో మాట్లాడుతున్న మంత్రి తానేటి వనిత, చిత్రంలో చందన నాగేశ్వర్, ఆకుల వీర్రాజు



సంఘీయులకు వస్త్రాలు బహూకరిస్తున్న జాన్‌వెస్లీ తదితరులు

కడియం: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని హోంమంత్రి తానేటి వనిత అన్నారు. వేమగిరి రాక్ యూత్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆమె, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. మంత్రి తానేటి వనిత కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. చందన నాగేశ్వర్, ఆకుల వీర్రాజు మాట్లాడుతూ క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, కడియం మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్, పార్టీ జిల్లా కార్యదర్శులు తాటికొండ విష్ణు, రాజమౌళి, గుత్తుల హరి ప్రసాద్, భైరవరపు నాగేశ్వరరావు, పాస్టర్లు పాల్గొన్నారు.

మిత్రా యూత్ ఆధ్వర్యంలో..

వేమగిరి ముత్యాలమ్మ పేటలో మిత్రా యూత్ ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో చందన నాగేశ్వర్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గిరజాల బాబు, యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, కాకులపాటి సోమరాజు, శీలం కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బిషప్ థామస్ సేవలు అభినందనీయం

సీటీఆర్ఐ: బిషప్ థామస్ చేస్తున్న సేవలను అభినందనీయమని ఏపీ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ అన్నారు. స్థానిక నటరాజ్ థియేటర్‌లోని దహించు అగ్ని మినిస్ట్రీస్ ఆడిటోరియంలో బుధవారం మినిస్ట్రీస్ అధినేత బిషప్ అరుల్ థామస్ పాస్టర్ల సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా చేస్తున్న అభివృద్ధిని అభినందించాలన్నారు. బిషప్ అరుల్ థామస్, అరుల్ షీభా థామస్‌కు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో వెయ్యి మంది సంఘ కాపరులు, మత పెద్దలు, పేదలకు వస్త్రాలు బహూకరించారు.

విద్యతోనే సమాజ అభ్యున్నతి సాధ్యం



గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

- సుపీరియర్ సిస్టర్ సాండ్రీనా
- ఘనంగా సెయింట్ ఆన్స్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు

రాజమహేంద్రవరం రూరల్: విద్యతోనే సమాజ అభ్యున్నతి సాధ్యమని విశాఖపట్నం సెయింట్ ఆన్స్ సొసైటీ ప్రొవిన్షియల్ సుపీరియర్ సిస్టర్ సాండ్రీనా అన్నారు. బొమ్మూరులోని సెయింట్‌ఆన్స్ పాఠశాల గోల్డెల్ జూబ్లీ ఉత్సవాలు బుధవారం సాయంత్రం అత్యంత వైభవంగా జరిగాయి. సెయింట్ ఆన్స్ పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ షీనా, ప్రిన్సిపాల్ సిస్టర్ ఝాన్సీ అధ్యక్షతన జరిగిన ఈ ఉత్సవాలలో సిస్టర్ సాండ్రీనా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మానవజాతి ఔన్నత్యానికి విద్య కీలకమన్నారు. సెయింట్ ఆన్స్ సొసైటీ అసిస్టెంట్ సుపీరియరల్ సిస్టర్ అన్‌మేరీగోపు మాట్లాడుతూ ఒత్తిడి లేని, నైతిక విలువలు కలిగిన బోధన అవసరమన్నారు. రాజమహేంద్రవరంలో సెయింట్ ఆన్స్ పాఠశాల 50 వసంతాలు పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. గ్రూప్ ఆఫ్ మినిస్ట్రీస్ గ్రూప్ కెప్టెన్, పూర్వ విద్యార్థి శ్రీహరి వెంపర్ల మాట్లాడుతూ వైమానికదళంలో 30 ఏళ్ల పాటు గ్రూప్ కెప్టెన్‌గా విధులు నిర్వహించానన్నారు. ఈనాడు తన అభివృద్ధికి ఆనాడు సెయింట్ ఆన్స్ పాఠశాలలో చదివిన పునాదే కారణమన్నారు. మరో పూర్వ విద్యార్థి మద్దాల వంశీకృష్ణ మాట్లాడుతూ ఇక్కడ చదివిన ఎందరో విద్యార్థులు ఉన్నత స్థాయిల్లో ఉన్నారన్నారు. ప్రస్తుతం రాజకీయాలలోకి వస్తున్న కోడి ప్రవీణ్ వంటి వారిని ప్రోత్సహించాలన్నారు. ప్రొవిషనల్ సుపీరియర్ ఫాదర్ బవిరి సురేష్‌బాబు, ఇస్రో శాస్త్రవేత్త, చంద్రయాన్‌లో సభ్యురాలు ఎం.హారిక మాట్లాడారు. అనంతరం ముఖ్యఅతిథుల చేతుల మీదుగా గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పూర్వవిద్యార్థుల సంఘం (అలూమ్ని) ప్రధాన కార్యదర్శి జాన్సన్, కోశాధికారి కోడి ప్రవీణ్, పూర్వ విద్యార్థులు, సెయింట్‌ఆన్స్ సుపీరియర్స్, సిస్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

జగన్ పాలనలోనే అందరి సంక్షేమం



కోరుకొండలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాజా

- రూ.9.40 కోట్లతో కోరుకొండ అభివృద్ధి
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆయన బుధవారం కోరుకొండలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం మసీద్ సెంటర్, బస్టాండ్ సెంటర్, సీతారామ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజలతో మాట్లాడి వారి బాగోగోలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ కోరుకొండ అభివృద్ధి కోసం రూ.9.40 కోట్లు కేటాయించామన్నారు. రూ.1.25 కోట్లతో శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం రోడ్డు విస్తరణ, రూ. 30 లక్షలతో గిరి ప్రదక్షిణ ఫుట్‌పాత్ మార్గం నిర్మాణం, రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణం చేపట్టామన్నారు. సొంతిల్లు లేని పేదలకు కాపవరంలో ఇంటి స్థలాల పట్టాలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సీతారామనగర్‌లో జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ సౌజన్యంతో, తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి బహూకరించిన వాటర్ ట్యాంకు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, పార్టీ నాయకులు తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, పసుపులేటి బుల్లియ్య నాయుడు, కేతినీడి అశోక్, బెల్లం ప్రసాద్, పత్తి పాపారావు, కోడూరి సత్తిరెడ్డి, చెరుకూరి దుర్గారావు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో విప్లవాత్మక మార్పులు

- ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్ చందన నాగేశ్వర్
- శాటిలైట్ సిటీలో పార్టీ కార్యాలయం ప్రారంభం



పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: సీఎం జగన్‌మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్ల కాలంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. శాటిలైట్ సిటీ బి బ్లాకులో నిర్మించిన వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యతను ఇస్తూ రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలను అందించడం జరుగుతుందన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికలలో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని గెలిపించి, సీఎం జగన్‌కు బహుమతిగా ఇవ్వాలన్నారు.

వైఎస్సార్ సీపీలో 150 మంది చేరిక

రజక సంఘం నాయకుడు కళింకోట రాజు ఆధ్వర్యంలో రజకులు, టీడీపీ, జనసేన నుంచి యువకులు, మహిళలు 150 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి చందన నాగేశ్వర్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), పార్టీ జిల్లా కార్యదర్శి తాటికొండ విష్ణుమూర్తి, రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, మాజీ సర్పంచ్ రుంకాని రమణమ్మ, మాజీ ఉపసర్పంచ్‌లు బొమ్ము శ్రీను, కడవకొల్లు వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ కాకరపల్లి అప్పారావు, సచివాలయ కన్వీనర్లు బత్తిన అప్పారావు, సఫారీ నాయుడు, పగడం లక్ష్మణరావు, రుంకాని రవికుమార్, పుచ్చ గోవింద్ రెడ్డి, పుచ్చ ప్రసన్న కుమార్ రెడ్డి, కాకుర్తి మురళి, దండంగి రామకృష్ణ శ్రీనివాస్, పొట్నూరి ప్రతాప్, గొర్రెల రమణ, మీగడ గంగాధరరావు, జుత్తుగా శ్రీను, కుడిపూడి పద్మ, ఎంవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

బోరు నిర్మాణానికి శంకుస్థాపన

శాటిలైట్ సిటీ దోబీఖానాలో బోరు నిర్మాణానికి చందన నాగేశ్వర్ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. దోబీఖానాలో బోరులేక రజకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించి మంజూరు చేయించారు. పంచాయతీ కార్యదర్శి తాడికృష్ణ, పార్టీనాయకులు పాల్గొన్నారు.

ఎనిమిదో రోజుకు సమ్మె

కంబాలచెరువు: పాఠశాల విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్ల సాధనకు చేస్తున్న సమ్మె బుధవారానికి ఎనిమిదో రోజుకి చేరుకుంది. స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదురుగా సమగ్రశిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చేస్తున్న సమ్మెకు నగర జనసేన నాయకుడు అనుశ్రీ సత్యనారాయణ మద్దతు ప్రకటించారు.

ఫర్నీచర్ వితరణ



సీతానగరం డిగ్రీ కళాశాలకు అందించిన ఫర్నీచర్

సీతానగరం: స్థానిక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు కుమారుడు డీవీ శివ కార్తిక్ రూ.1.20 లక్షల విలువైన ఐదు జతల బెంచీలు, డెస్కులు, ఎనిమిది స్టూడెంట్ బెంచీలు, నాలుగు టీచర్ల టేబుళ్లను కళాశాలకు అందించారు. దీనిపై ఇతర అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు కళాశాలకు వచ్చిన రెండేళ్లలో వాళ్ల అమ్మగారి జ్ఞాపకార్థం సుమారు రూ.4 లక్షల విలువైన అభివృద్ధి కార్యక్రమాలు కళాశాలలో చేపట్టారు.

సంకల్పమే ఆయుధంగా ముందుకుసాగాలి



స్వామి వివేకానంద ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ముఖ్య అతిథులు

అనపర్తి: సంకల్పమే ఆయుధంగా యువత ముందుకుసాగాలని ఎమ్మెల్యే సతీమణి, వైఎస్సార్ సీపీ నాయకురాలు సత్తి ఆదిలక్ష్మి అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని అనపర్తి శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం జాతీయ యువజనోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక జీబీఆర్ విద్యా సంస్థల సెమినార్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆదిలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భారతీయ యువతకు దిశా నిర్దేశనం చేసిన స్వామి వివేకానందుని స్ఫూర్తిగా తీసుకోవాలని యువతకు సూచించారు. స్వామి వివేకానంద ప్రతిభ పరీక్షలో మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన 23 విద్యాసంస్థలకు చెందిన 69 మంది విద్యార్థులకు, 23 మంది ఉపాధ్యాయులకు స్వామీజీ సాహిత్యం, ప్రశంసా ప్రతాలను అందజేశారు. మండల పరిధిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అనపర్తి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.ప్రియదర్శిని, రామవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.మేఘనరెడ్డి, అనపర్తి టీఏఆర్ స్కూల్ విద్యార్థిని ఆర్.గంగమణిశ్రీలకు స్వామి వివేకానంద ప్రతిభా పురస్కారాల పేరిట ఒక్కొక్కరికి రూ.1000, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాయవరం సాయితేజ విద్యానికేతన్ డైరెక్టర్ కర్రి భానురేఖ, రామకృష్ణ మిషన్ సభ్యుడు ఎం.దుర్గాప్రసాద్, సర్పంచ్ వారా కుమారి, డాక్టర్ ఏఎస్ఎన్ మూర్తి, తేతలి త్రినాథరెడ్డి, కర్రి సందీప్‌రెడ్డి, మహర్షి సాగర్, జూనియర్‌కళాశాల ప్రిన్సిపాల్ పీఆర్ఎల్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలు

కడియం: జేగురుపాడు వైఎస్సార్ జగనన్న కాలనీలో సంఘ కాపరి, కడియం మండలం పాస్టర్స్ ఫెలోషిప్ సెక్రటరీ రెవరెండ్ సీహెచ్ రత్నదీప్ ఆధ్వర్యంలో గుంటూరు ప్రధాన కేంద్రంగా నడుపబడుతున్న బైబిలు మిషను మోరియా మహిమ మందిరంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. డి.సునీల్ కుమార్ (కాకినాడ), ఎం.సంతోష్ కుమార్(గోకవరం) విచ్చేసి క్రిస్మస్ సందేశం అందించారు. క్రిస్మస్ కేక్ కటింగ్, కేండిలైట్ సర్వీస్, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సీహెచ్ రత్నదీప్, శ్రీవల్లి పాల్గొన్నారు.

విద్యార్థులకు జీవన నైపుణ్యాలను బోధించాలి



మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ రమణ

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థులకు జీవన నైపుణ్యాలు, విలువలను బోధించాలని జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణాసంస్థ (డైట్) ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ అన్నారు. లైంగికంగా వ్యాపించు వ్యాధులు, హెచ్ఐవీపై బుధవారం జిల్లాలోని జీవశాస్త్ర ఉపాధ్యాయులు, హెచ్ఎంలకు బొమ్మూరులోని డైట్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ అధ్యాపకుడు కేవీ సూర్యనారాయణ మాట్లాడుతూ గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, ప్రేమ, ఆకర్షణకు మధ్య తేడాలను విద్యార్థులకు తెలపాలన్నారు. అధ్యాపకులు డి.సుజాత రత్నం మాట్లాడుతూ కౌమార దశల్లో విద్యార్థుల్లో కలిగే మార్పులు, ఆర్‌టీఐ, ఎస్‌టీఐలను వివరించారు. మరో అధ్యాపకుడు డీఎస్‌వీ సత్యనారాయణ మాట్లాడుతూ హెచ్ఐవీ వ్యాపించే విధానం, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. డైట్ ద్వితీయ సంవత్సర ఛాత్రోపాధ్యాయులు హెచ్ఐవీపై కథానిక, స్కిట్ ప్రదర్శించారు.

కిక్ బాక్సింగ్‌లో విద్యార్థుల సత్తా

ప్రకాశం నగర్: కిక్ బాక్సింగ్ అండర్ - 19 రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. గంగవరపు అక్షిత ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం, కుడిపూడి సింధు ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం సాధించారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్‌వీఎల్ నరసింహం బుధవారం ప్రకటనలో తెలిపారు. విజేతలను జోన్ వన్ అండ్ టూ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఐ.శారద, జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి జేవీవీస్ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు అభినందించారన్నారు.

50 లీటర్ల సారా స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ పుంత రోడ్డులో సారా బట్టీపై బుధవారం దాడులు నిర్వహించి 50 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, ఐదు వేల లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశామని బొమ్మూరు ఎస్సై మహమ్మద్ జుబేర్ తెలిపారు. నిందితుడు పరారయ్యాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

కోలమూరు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నీరుగొండ్ల సత్యనారాయణను అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.వి.రమణ తెలిపారు. అతడి నుంచి 180 ఎంఎల్ ఏడు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.